క్లుప్తంగా

ఎంపీతో ఆర్టీసీ వైస్ చైర్మన్



ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: విజయవాడలోని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు విషయాలపై కాసేపు చర్చించారు. వారితోపాటు డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఉన్నారు.

గొల్లపల్లె పాఠశాల విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

యాదమరి: అపోలో టోటల్ హెల్త్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఒలంపియాడ్ ప్రతిభ పరీక్షల్లో కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని యాదన్య విశేష ప్రతిభ కనబరిచారు. వారు మొత్తం 17 మండలాలలో 38,541 మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించగా, కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న యాదన్య లెవల్ 3లో ప్రథమ బహుమతి సాధించింది. దీంతో విద్యార్థినికి రూ.5వేలు నగదు, షీల్డు శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని దిగువ మోదలపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పేదలందరికీ అందుబాటులో వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశావర్కర్లు సౌందర్య, పుష్ప, డీఈఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఫైలేరియాను నిర్మూలిద్దాం



తనిఖీలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: నగరంలోని తోటపాళ్యంలో గురువారం బోదకాలు (ఫైలేరియా) వ్యాధి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని డీఎంఅండ్ హెచ్ఓ ప్రభావతీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైలేరియాను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణ, శ్యాంపిల్స్ సేకరణ, ల్యాబ్ పరీక్షలు తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సిబ్బంది ఫీరుసాహెబ్, గోపి, నారాయణ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే ఆడుదాం

- హోరాహోరీగా క్రీడాపోటీలు
- రాణిస్తున్న క్రీడాకారులు

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడా నైపుణ్యాలను, ప్రతిభను గుర్తించి వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైస్ ఎంపీపీ రోజా అన్నారు. మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్లో వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు ఈ టోర్నీని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మరింత రాణించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జమున, పార్టీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, రత్నంరెడ్డి, గజేంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

అయ్యప్పగారిపల్లిలో..

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం-ఆంధ్రా క్రీడాపోటీల్లో గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరి తెలిపారు. మండలంలోని అయ్యప్పగారిపల్లి, పి.కొత్తకోట, వావిల్‌తోట పంచాయతీల్లో శుక్రవారం ఆడుదాం-ఆంధ్రా క్రీడాపోటీలను నిర్వహించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఆడుతూ రాష్ట్ర స్థాయికి వెళ్లగలే అవకాశం ఈ క్రీడా పోటీలకు ఉందని తెలిపారు. పి.కొత్తకోటలో ఆడిన క్రీడాకారులను క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వావిల్‌తోట సర్పంచ్ మహేశ్వరి, పి.కొత్తకోట సర్పంచ్ పద్మజరాణి, నాయకులు నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో బ్యాడ్మింటన్ ఆడుతున్న బాలికల జట్టు

ఉల్లాసంగా క్రీడా పోటీలు

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాల, తవణంపల్లె హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను అధికారులు, క్రీడాకారులు ఉల్లాసంగా నిర్వహించారు. హైస్కూల్లో వాలీబాల్ పోటీలు, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలను పురుషులు, మహిళల విభాగంలో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. అరగొండలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆటల పోటీలను ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, హెచ్ఎం శ్రీరంజని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న పోటీలు

యాదమరి: మండల పరిధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిర్వహించిన క్రీడల్లో హోరాహోరీగా జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని సచివాలయాల పరిధిలో ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పలువురు క్రీడాకారులు హాజరై పాల్గొన్నారు. క్రీడలను ఎంపీడీఓ శివరాజ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని నింపేందుకే..

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంత యువలో క్రీడా స్ఫూర్తి నింపి ప్రోత్సహించేందు కోసమే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో శుక్రవారం ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. పోటీలను అధికారులు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ, క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేయాలనే లక్ష్యంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు తమ సత్తాచాటి క్రీడల్లో రాణించాలన్నారు.



తవణంపల్లె : బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



ఐరాల: క్రీడాకారులకు వాలీబాల్ అందజేస్తున్న నాయకులు



ఐరాల: ఎం.పైపల్లె హైస్కూల్లో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు









పూతలపట్టు: క్రీడాసామగ్రిని అందజేస్తున్న అధికారులు, యాదమరి: హోరాహోరీగా వాలీబాల్ పోటీలు, తవణంపల్లె : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, బంగారుపాళెం : ఖోఖో ఆడుతున్న బాలికలు

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని ఎగువ మత్యం గ్రామంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధి కావచ్చు, ప్రాథమిక స్థాయిలో కుష్టువ్యాధిని గుర్తిస్తే, పూర్తిగా నయం చేయవచ్చని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కుష్టువ్యాధి లక్షణాలను వివరించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జనవరి నెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ మణి, ఏఎన్ఎ తులసి, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు హాస్యాస్పదం

ఐరాల: కుప్పం నియోజకవర్గాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళతానంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని మహిళా శిశు, సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి శుక్రవారం ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు సీఎంగా ఉండి కుప్పాన్ని కనీసం మున్సిపాలిటీగా చేయలేకపోయిన చంద్రబాబు ఇప్పుడు ఎక్కడికో తీసుకెళతామని మభ్య పెడుతున్నారని అన్నారు. జగనన్న సీఎం అయ్యాక కుప్పంను మున్సిపాలిటీ చేసి, రెవెన్యూ డివిజన్‌కు అప్‌గ్రేడ్ చేశారని గుర్తు చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ.1.97లక్షలు హుండీ ఆదాయం వచ్చినట్టు ఎండోమెంట్ అధికారి కమలాకర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ టెంపుల్స్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, స్థానిక ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

40 ఏళ్లలో లేని విధంగా అభివృద్ధి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో గత 40 ఏళ్లలో లేని విధంగా అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. స్థానిక 25వ డివిజన్ బాలాజీకాలనీలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన వారు సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును, కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలతో పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం అలాంటి దుర్భర పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమం అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, నగర సచివాలయ కన్వీనర్ కిరణ్, నాయకులు దేవరాజులు, శేఖర్ పాల్గొన్నారు.

పేదల కలలను నెరవేర్చేలా..

చిత్తూరు రూరల్: పేదల కలలను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పచ్చన్నపల్లి గ్రామంలో శుక్రవారం ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని వంద మందికి ఎమ్మెల్యే చేతులమీదుగా పట్టాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతోందన్నారు. నిలువనీడలేని వారికి ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు కట్టించే బాధ్యతను తీసుకుందన్నారు. ఇలా ఏ ప్రభుత్వం చేయలేదని, మళ్లీ జగనన్న గెలిపించుకుందామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్యాగరాజులు, ఎంపీటీసీ సుదర్శన్, నాయకులు సంపత్, స్టాండ్లీ, బాబు తదితరులు పాల్గొన్నారు.



పచ్చనపల్లిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఘనంగా చర్చి వార్షికోత్సవం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని 11వ డివిజన్ చెన్నమగుడిపల్లిలోని ఫ్యూర్ గాస్పల్ చర్చి 18వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా చర్చి పాస్టర్ రమేష్ ప్రసాద్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి సతీమణి ఇందు ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. పాస్టర్ రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏటా చర్చి వార్షికోత్సవం రోజున పేదలకు వస్త్ర దానం చేయడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఏసుప్రభు కృపతో 2024 సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు లీనారెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు జాషువ, ధనరాజ్, కెపి శ్రీధర్, నవీన్, మైఖేల్, రఘుపతి పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సతీమణి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు హేమకుమార్, రూప్‌కుమార్, సురేష్ తెలిపారు. చిత్తూరులో ట్రాన్స్‌కో, అర్బన్, రూరల్ డివిజన్లలో శుక్రవారం కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఇంధనశాఖ ఆధ్వర్యంలో మూడో పార్టీ విధానాన్ని రద్దు చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇన్సూరెన్స్, గ్రాట్యుటీలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, శరవణ, మురళీ, మనీష్‌కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ల బదిలీలు హర్షణీయం

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు జీరో సర్వీస్ బదిలీలు నిర్వహించడం హర్షణీయమని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు కల్పిస్తే జూనియర్ లెక్చరర్లకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు డా.హేమలత మాట్లాడుతూ రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనం, పరీక్షలు కొత్త జిల్లాల ప్రకారం నిర్వహించడం మంచి పరిణామమని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆ సంఘం ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను డీవీఈఓ సయ్యద్‌మౌలా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కిషోర్‌కుమార్, రియాజ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీవీఈవో సయ్యద్ మౌలా

ఎంఈఓలతో ఎస్టీయూ కార్యవర్గం



యాదమరి: మండలంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎంపికైన ఎస్టీయూ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శుక్రవారం సాయంత్రం ఎంఈఓలు రుక్మిణీ, ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఉపాధ్యాయులకు నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంఈఓలు మాట్లాడుతూ మార్చిలో పదో తరగతి పరీక్షలు ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలనని సూచించారు. మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీలో ఊపందుకున్న వరి నాట్లు



ఎగువ మోదలపల్లె వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

- పంట సాగులో రైతులు బిజీ బిజీ
- మండలంలో 250 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం

తవణంపల్లె: రబీ సీజన్‌లో వరిసాగులో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. రైతులు వరి నార్లు పోయడం, పొలాల్లోకి సేంద్రియ ఎరువులు తరలించడం, దుక్కులు సిద్ధం చేయడంలో రైతన్నలు నిమగ్నమయ్యారు. అధిక దిగుబడినిచ్చే వరి విత్తనాలను ఎంపిక చేసుకొని నారుపోస్తున్నారు. మండలంలో రబీ సీజన్‌లో 220 హెక్టార్లలో వరి పంట సాగు చేయాలనేది ప్రభుత్వం లక్ష్యం. ఇప్పటి వరకు రైతులు నార్లు పోయడం, దుక్కులు సిద్ధం చేస్తుండగా కొంత మంది నాట్లు వేయిస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు సుమారు 80 హెక్టార్లలో వరినాట్లు వేయడానికి రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే 35 హెక్టార్లలో వరినాట్లు వేయగా వ్యవసాయ అధికారి ఆదేశాలతో రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది పంట నమోదు చేస్తున్నారు. మండలంలో సాగునీరు ఉన్న రైతులు మాత్రమే వరి పంట సాగుకు ముందుకు వస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారులు సిబ్బంది చెప్పారు. మండలంలోని రైతులు వివిధ రకాల పంటల(మిక్సింగ్)ను ఒకేచోట సాగు చేయడం వలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. రైతులు ఈ వ్యవసాయ పద్ధతులను పాటించాలని కోరారు. మంచిదిగుబడి సాధిస్తే ఇతర మండలాల రైతులు కూడా ఈ విధానాన్ని అనుసరించే అవకాశం ఉంటుందని చెప్పారు.

మెలకువలతో అధిక దిగుబడి సాధ్యం



మండలంలో పంట సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు, మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యం అవుతుంది. రైతులు విత్తన శుద్ధి చేసి నారు వేస్తే చీడలు, పీడలు రాకుండా నివారించవచ్చు. అధిక దిగుబడినిచ్చే ఎన్ఎల్ఆర్(నర్మద), నెల్లూరు సోనా, బీపీటీ 5204 రకం, ఆర్ఎన్ఆర్ 34449 రకం వరి విత్తనాలను ఎక్కువ మంది ఎంపిక చేసుకొని సాగు చేస్తున్నారు. మండలంలో 40 హెక్టార్లలో వరి పంట నమోదు చేశాం. రైతులు ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపడితే, అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చు. వరి సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని అధిగ మించే దిశగా రైతులు నాట్లు వేస్తున్నారు.

– జి. ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె